క్లుప్తంగా

చిట్టి చేతులతో మట్టి గణపతి



వినాయకులను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

కాసిపేట: మండలంలోని రేగులవాడ ఆశ్రమ పాఠశాల విద్యార్థులు సోమవారం మట్టి వినాయక విగ్రహాలు తయారు చేశారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాలు వద్దు.. మట్టి విగ్రహాలే ముద్దు అని నినదించారు. విద్యార్థులకు పీవోపీ విగ్రహాల వల్ల కలిగే నష్టాలను ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి వివరించారు. పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ వీలైనంత వరకు మట్టితో చేసిన వినాయక విగ్రహాలను వినియోగించాల్సిందిగా కోరారు.

రిటైర్డ్ ఆర్మీ జవాన్‌కు సన్మానం



దంపతులను సన్మానిస్తున్న మిత్రులు

దండేపల్లి: మండలంలోని లక్ష్మీకాంతపూర్ గ్రామానికి చెందిన బాదినేని చంద్రశేఖర్ 22ఏళ్ల పాటు ఆర్మీజవాన్‌గా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ పొందాడు. ద్వారక జెడ్పీ ఉన్నత పాఠశాలలో అతడితో 1998–99 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన మిత్రులు సోమవారం అదే పాఠశాలలో అతడిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బాల్యమిత్రులు ప్రమోద్, సురేందర్, భూమన్న, అశోక్, కవిత, లలితా పాల్గొన్నారు.

ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్‌పై అవగాహన

బెల్లంపల్లి: విద్యా సంస్థల్లో ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్ లాంటి వికృత చేష్టలకు పాల్పడితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి–1 టౌన్ సీఐ శ్రీనివాస్, బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్‌లు అన్నారు. బెల్లంపల్లిలోని పాలిటెక్నిక్ కళాశాల, అల్బర్ట్ ఐటీఐ కళాశాలలో సోమవారం అవగాహన సదస్సులు నిర్వహించారు. విద్యార్థులు ఫిర్యాదు చేసేందుకు 24గంటల హెల్ప్‌లైన్ నంబర్లను విద్యా సంస్థలు, యాజమాన్యం అందుబాటులో ఉంచాలన్నారు. ఎవరైనా ర్యాగింగ్‌కు గురైతే యాజమాన్యానికి లేదా ప్రిన్సిపాల్‌కు సమాచారం అందించాలన్నారు.

అక్రమ పట్టా రద్దు చేయాలి



మాట్లాడుతున్న బట్వాన్‌పల్లి గ్రామస్తులు

బెల్లంపల్లిరూరల్: బెల్లంపల్లి మండలం బట్వాన్‌పల్లి గ్రామంలోని సర్వే నంబర్ 8లో గల ప్రభుత్వ పరంపోగు భూమిని అక్రమంగా చేసుకున్న పట్టాను రద్దు చేయాలని గ్రామస్తులు కోరారు. బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. సర్వే నంబర్ 8లో పరంపోగు భూమిని గ్రామానికి చెందిన దుర్గం ధనుంజయ అక్రమంగా పట్టా చేసుకుని చెరువుకు వెళ్లే దారిని కంచెతో మూసి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాడని సబ్‌కలెక్టర్‌కు విన్నవించారు. అధికారులు స్పందించి విచారణ జరిపించి పట్టాను రద్దు చేసి గ్రామస్తులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

రేషన్‌డీలర్ల ఆందోళన



కలెక్టరేట్ ఎదుట ఆందోళనలో రేషన్‌డీలర్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట రేషన్ డీలర్లు ఆందోళన చేపట్టారు. అనంతరం కలెక్టర్ కుమార్‌దీపక్‌కు వినతిపత్రం అందజేశారు. కమీషన్ వేర్వేరుగా కాకుండా, పాత పద్ధతిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఒకేసారి విడుదల చేసి ఖాతాలో జమయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

శాంతిహోమం

మంచిర్యాలఅర్బన్: జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మీగణపతి ఓంకారేశ్వర స్వామి దేవాలయంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో సోమవారం శాంతిహోమం, మృత్యుంజయ హోమం నిర్వహించారు. భక్తులకు ఏ ఆటంకం కల్గకుండా చూడాలని శాంతిహోమం, ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు ఆరోగ్యంగా ఉండాలని కోరుకుంటూ మృత్యుంజయ హోమం చేపట్టారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు రవీందర్, ప్రభాకర్, తిరుపతి, వెంకటేశ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు నరేష్, శంకర్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



‘భగీరథ’ నీరు వృథా

భీమారం: మండల కేంద్రంలోని హైస్కూల్ సమీపంలో మిషన్ భగీరథ నీటి పైపులైన్ పగిలి నీరు రోడ్డుపై ప్రవహిస్తున్నా గ్రామపంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. నీళ్ల రోడ్డు పై ప్రవహిస్తుండడంతో దోమలు వ్యాప్తి చెందుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు వృథా కాకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.





నిర్వహణ లోపం.. నిరుపయోగం

శ్రీరాంపూర్: నస్పూర్ పరిధిలో రెండు డెడ్ బాడీ ఫ్రీజర్లు అందుబాటులో ఉండగా వాటి నిర్వహణను సిబ్బంది గాలికి వదిలేయడంతో మూలనపడ్డాయి. మృతదేహాల తరలింపునకు ఉపయోగించే వైకుంఠ రథం మరమ్మతు చేయని కారణంగా గోదాములో నెల రోజులకు పైగా నిరుపయోగంగా ఉంది. సంబంధిత అధికారులు స్పందించి డెడ్ బాడీ ఫ్రీజర్లను, వైకుంఠ రథానికి మరమ్మతు చేయించి అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



సెగ్రిగేషన్ షెడ్డా.. బైక్ స్టాండా?

దండేపల్లి: గ్రామాల్లో సేంద్రీయ ఎరువుల తయారీకి గత ప్రభుత్వం సెగ్రిగేషన్ షెడ్లు నిర్మించింది. ప్రస్తుతం అవి చాలా చోట్ల నిరుపయోగంగా ఉంటున్నాయి. దండేపల్లి మండలం నాగసముద్రం సెగ్రిగేషన్ షెడ్డులో చెత్త వేయకుండా నిరుపయోగంగా ఉండటంతో, సమీప పొలాల రైతులు బైక్‌స్టాండ్‌గా వినియోగించుకుంటున్నారు.

ముంచుతున్న నీల్వాయి

* వరద మళ్లింపు చర్యలు శూన్యం
* ఎడమ కాలువకు అడుగడుగునా గండ్లు
* వందల ఎకరాల్లో పత్తి, వరి పంటలకు నష్టం



ఈ చిత్రంలో కనిపిస్తున్నది వేమనపల్లికి చెందిన ఎల్లల లచ్చన్న, సత్తన్నల కుటుంబ సభ్యుల పత్తి చేను. నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ వరద దిశ మారి రావడంతో పత్తి పంట ఆరు ఎకరాలు మాడిపోయి నల్లబడింది. ఆర్‌అండ్ బీ రోడ్డు పక్కనే ఉంది. మామూలుగా పొలాల్లో నుంచి వరద వెళ్లిపోయేది. కాని ఎడమ కాలువకు గండ్లు పడి వరద సడన్క మోరి వైపు రావడంతో ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ముల పంటలు వరద పాలయ్యాయి.



ఈ చిత్రంలో కనిపిస్తున్నది ఎల్లల శంకర్. రాజారాం శివారులో ఎడమ కాలువ పక్కనే ఎకరం పొలం వరద కోతకు గురైంది. ఎడమ కాలు వకు ఎగువన వరద మళ్లించేందుకు పనులు చేపట్టకపోవడంతో అడవిలో నుంచి వచ్చే వరదతో 20ఎకరాల విస్తీర్ణంలోని పంటలను ముంచెత్తుతోంది.



వరి పొలాల్లో వేసిన ఇసుక మేటలు

వేమనపల్లి: నీల్వాయి ప్రాజెక్టు నిర్మాణం వల్ల పంటలకు సాగు నీరు అందే మాట దేవుడెరుగు.. వందలాది ఎకరాల పంటలు మాత్రం వరద పాలవుతున్నాయి. సాధారణంగా కాలువలు నిర్మిస్తే వాటి పక్క నుంచి వచ్చే వరద కాలువ దాటి వెళ్లేందుకు వయాడక్ట్, మళ్లింపు వంతెనలు చేపట్టాలి. కాని ఎనిమిది సంవత్సరాల క్రితం ఎడమ కాలువ నిర్మించిన అధికారులు, గుత్తేదారులు అవగాహన లోపంతో ఇష్టారాజ్యంగా పనులు చేపట్టారు. వరద వెళ్లే మార్గాలు చేపట్టలేదు. దీంతో రాజారాం గ్రామ సమీపం నుంచి మత్తడి ఒర్రే వరకు ఎడమ కాలువ నిర్మించిన తీరు మొత్తం లోప భుయిష్టంగా ఉంది. ఒర్రెల వద్ద కాలువపై నుంచి వరద వెళ్లేందుకు కొన్ని చోట్ల బాక్స్ సిస్టమ్ నిర్మించారు. కాటెల తిరుపతి, జొర్రిగల వెంకటేష్ అనే రైతుల పొలాల వద్ద వరద మళ్లింపుకై పనులు చేపట్టాలి. అక్కడ కల్వర్టులు నిర్మించకపోవడంతో ఆ ప్రాంతంలో 50ఎకరాల్లో వరి పంటలు జలసమాధి అవుతున్నాయి. ఎక్కడ పడితే అక్కడ పొలాలకు కాలువకు గండ్లు పడుతున్నాయి.

ఎదురెక్కిన వరద...

సాధారణంగా కాలువలు నిర్మిస్తే సాగునీరు దిగువకు వదులుతారు. రాజారాం, గోదుంపేట శివారుగుండా నిర్మించిన ఎడమ కాలువలో నీరు దిగువ నుంచి కిలోమీటర్ దూరం ఎగువకు దిశ మారి ప్రవహిస్తోంది. కారణం భారీ వర్షాలకు వచ్చే వరద కాలువ దాటి వెళ్లేందుకు మళ్లింపు కల్వర్టులు లేకపోవడంతో కాలువకు గండ్లు పడుతున్నాయి. కాలువ శిథిలమై పలుచోట్ల ఇసుక మేటలతో నిండిపోతుంది. దీంతో సాగునీటి వరద రాకపోగా, వర్షపు నీరు దిగువకు వెళ్లలేక గోదుంపేట శివారు నుంచి రాజారాం, వేమనపల్లి, కొత్తపల్లి శివారు వైపు దిశ మారి ప్రవహిస్తోంది. రాజారాం గ్రామ పక్కన నుంచి నల్లాలనుయ్యి వంతెన, సడన్క మోరి నుంచి కొత్తపల్లి వాగు వైపు వెళ్లి ఎంచపాయే వరకు పోటెత్తి ప్రవహిస్తోంది. దీంతో సుమారు 300ఎకరాల్లో వరి పంటలు, 200ఎకరాల్లో పత్తి పంటలు వరద భారిన పడుతున్నాయి. పొలాల్లో ఇసుక మేటలు వేయడం, కోతకు గురికావడం, గండ్లు పడటం మామూలైపోయింది. ఉన్నతాధికారులు స్పందించి లోపభుయిష్టంగా ఉన్న ఎడమ కాలువకు రీ డిజైనింగ్ చేసి సాఫీగా వరద వెళ్లేందుకు మళ్లింపు పనులు చేపట్టాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. నష్టపోయిన రైతులకు పంట నష్టపరిహారం ఇప్పించాలని వేడుకుంటున్నారు.

కాలువ పరిశీలిస్తాం

నీల్వాయి ప్రాజెక్టు ఎడమ కాలువ రాజారాం, గోదుంపేట శివారుల్లో పలుచోట్ల గండ్లు పడిన విషయం నా దృష్టికి రాలేదు. గతంలో కాలువ డిజైనింగ్ జరిగింది. అప్పటి అధికారుల పరిశీలనను బట్టి కాలువ నిర్మించారు. డిజైనింగ్‌లో ఉన్న ప్రకారంగా ఒర్రె నుంచి వచ్చే వరద కాలువలు దాటి వెళ్లేందుకు యూటీని నిర్మించాం. వేరే చోట్ల నిర్మించేందుకు ఇప్పుడు వీలు పడదు. గండ్లు పడిన విషయంపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు నివేదిక పంపిస్తాం.

– వెంకటస్వామి, ఇరిగేషన్ డీఈ

మట్టి గణపతులను పూజిద్దాం

* కలెక్టర్ కుమార్ దీపక్



విగ్రహాలు అందిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలఅగ్రికల్చర్: వినాయక చవితి సందర్భంగా మట్టి గణపతులను పూజించి పర్యావరణాన్ని కాపాడుకుందామని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం మట్టి వినాయక విగ్రహాలను అధికారులకు అందజేశారు. మట్టి వినాయకులను పూజించడం వల్ల పర్యావరణాన్ని పరిరక్షించడంతోపాటు సంస్కృతి, సంప్రదాయాలు కాపాడవచ్చని తెలిపారు.

నవరాత్రులు సామరస్యంగా జరుపుకోవాలి..

గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో ప్రజలంతా సామరస్యంగా జరుపుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, వివిధ శాఖల అధికారులతో కలిసి సమీక్షించారు. జిల్లాలో గణపతి వినాయక మండపాల ఏర్పాటుకు పోలీస్ అనుమతి పొందాలని, అనుమతి పొందిన గణపతి మండపాలకు ఉచిత విద్యుత్ సరఫరా సౌకర్యం అందిస్తామని తెలిపారు.

కళాశాలలో సమస్యలు పరిష్కరించాలి

జన్నారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మరుగుదొడ్లకు నీటి సరఫరా లేకపోవడంతో నిరుపయోగంగా ఉంటున్నాయని, కళాశాలలో ఉన్న విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని సోమవారం నవతరం స్టూడెంట్ ఫెడరేషన్(ఎన్ఎస్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నీరటి రామ్‌ప్రసాద్ పటేల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

మొరం టిప్పర్ల అడ్డగింత



అడ్డుకున్న టిప్పర్ల ముందు గ్రామస్తులు

దండేపల్లి: మండలంలోని అందుగులపేట శివారులో నిర్మించే సోలార్ ప్లాంటు పనుల్లో భాగంగా మొరం టిప్పర్లు నడవటంతో రోడ్లు పాడవుతున్నాయని వందుర్‌గూడ గ్రామస్తులు ఆరోపించారు. ఈ క్రమంలో సోమవారం సాయంత్రం మొరం టిప్పర్లను గ్రామస్తులు అడ్డుకున్నారు. రోడ్లు పాడైతే ఎవరు బాగుచేయిస్తారని ప్రశ్నించారు. దీంతో చేసేదేమి లేక టిప్పర్లను పక్కకు నిలిపి వేశారు. ఈ విషయంలో అధికారులు చొరవ చూపాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

అల్లుకున్న ప్రమాదం..!



శ్రీరాంపూర్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్‌లో గల న్యూనాగార్జునా కాలనీ ప్రాణహిత స్టేడియం ముందు నుంచి సింగాపూర్ ఆర్‌అండ్ఆర్ కాలనీకి వెళ్లే దారిలోని స్టేడియం మూలమలుపు వద్ద గల విద్యుత్ మినీ ట్రాన్స్‌ఫార్మర్‌ను మొక్కలు అల్లుకున్నాయి. విద్యుత్ వైర్లకు సైతం పాకి ఉన్నాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్‌కు అల్లుకున్న మొక్కలను తొలగించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

విరిగిన విద్యుత్ స్తంభం



దండేపల్లి: మండల కేంద్రంలోని మసీదు వాడకు వెళ్లే రోడ్డులో విద్యుత్ స్తంభం కొస విరిగి ప్రమాదకరంగా మారింది. సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విరిగిన స్తంభాన్ని తొలగించి దాని స్థానంలో కొత్త స్తంభం వేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఎన్నికల హామీలు అమలు చేయాలి

* దండేపల్లిలో బీజేపీ నిరసన ర్యాలీ



మాట్లాడుతున్న రఘునాథ్

దండేపల్లి: ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్ డిమాండ్ చేశారు. దండేపల్లిలో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరసన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. బస్టాండ్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ధర్నా చేపట్టి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎలాంటి షరతులు లేకుండా రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. మహిళలకు నెలకు రూ.2500, కల్యాణ లక్ష్మి పథకంలో రూ.1లక్షతోపాటు తులం బంగారం అందించాలని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ రోహిత్‌దేశ్‌పాండేకు వినతిపత్రం అందించారు. బీజేపీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవిగౌడ్, సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ధర్నా

తాండూర్: తాండూర్ మండల పరిధిలో ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని తాండూర్ మండల బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. తహసీల్దార్ కార్యాలయం, మండల పరిషత్ కార్యాలయాల వద్ద సోమవారం ధర్నా నిర్వహించి ఎంపీడీవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, జిల్లా ఉపాధ్యక్షుడు పులుగం తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి చిలుముల శ్రీకృష్ణదేవరాయులు, మండల అధ్యక్షుడు భరత్ తదితరులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మందమర్రి, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలతో పాటు గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ ఆఫీస్ వద్ద బీజేపీ ఆధ్వర్యంలో నాయకులు ఆందోళన నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ సతీష్‌కుమార్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నరేష్, ఆ పార్టీ నాయకులు జనార్దన్, ఠాకూర్ ధన్‌సింగ్, పోశం, సంజీవరావు, దీక్షితులు, రాయమల్లు తదితరులు ఉన్నారు.

ఆశల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశకార్యకర్తలు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆశవర్కర్స్ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టి అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్, వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శోభ, సీఐటీయూ నాయకులు ప్రకాష్, లక్ష్మణ్, పాయిరాల రాములు, సరోజ, విజయలక్ష్మి, కవిత, లీలావతి, సువర్ణ, అరుంధతి లక్ష్మి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

నెన్నెల: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆశ వర్కర్లు మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లక్ష్మణ్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. జూలై నెల జీతం ఇంత వరకు రాలేదన్నారు. ఫిక్స్‌డ్ వేతనం రూ.18వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా నెల జీతం క్రమం తప్పకుండా ఇస్తూ పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్వరూప, స్వప్న, మధునక్క తదితరులు ఉన్నారు.

28న సామాజిక తనిఖీ ప్రజావేదిక

కాసిపేట: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఈ నెల 28న ఈజీఎస్ 15వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సత్యనారాయణసింగ్ తెలిపారు. మండలంలోని 22గ్రామపంచాయతీల్లో 2024 ఏప్రిల్ 1నుంచి 2025 మార్చి31 వరకు చేపట్టిన పనులకు ఈ నెల 17నుంచి 27వరకు సామాజిక తనిఖీ బృందాలు తనిఖీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈజీఎస్ కూలీలు హాజరై సమస్యలు పరిష్కరించుకోవాల్సిందిగా కోరారు.

పేకాటస్థావరంపై దాడి

జైపూర్: మండలంలోని నర్వ గ్రామంలో ఓ ఇంట్లో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారంతో పోలీసులు సోమవారం పేకాటస్థావరంపై దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని రూ.14,200 పట్టుకున్నట్లు స్థానిక ఎస్సై శ్రీధర్ తెలిపారు.

అటెన్షన్ ప్లీజ్.. మన్యంలో మందు సీసాలు



భీమారం: మంచిర్యాల అటవీ డివిజన్‌పరిధిలోని భీమారం రిజర్వుఫారెస్ట్‌లో మందుబాబులు పార్టీలు చేసుకొని సీసాలు అలానే వదిలి వెళ్తున్నారు. మంచిర్యాల-చెన్నూర్ జాతీయరహదారి పక్కనే రిజర్వుఫారెస్ట్ ఉండటంతో చాలామంది అడవుల్లో పార్టీలు చేసుకుంటున్నారు. అనంతరం సీసాలు ధ్వంసం చేయడంతో అడవుల్లో సంచరించే వన్యప్రాణులకు ఇబ్బందిగా మారింది. ఈ విషయంలో అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సంబంధిత అధికారి: సుధాకర్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ ఫోన్ నంబర్ : 94936 59059

సంక్షిప్త వార్తలు

* **ఉచిత కంటి వైద్య శిబిరం**

చెన్నూర్: ఉచిత కంటి వైద్య శిబిరం నిరుపేదలకు మేలు చేకూరుతుందని సీఐ దేవేందర్‌రావు అన్నారు. స్థానిక కొత్త బస్టాండ్ ప్రాంతంలో గల ఓ ఫంక్షన్ హాల్లో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 120మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై సుబ్బారావు, లయన్స్ క్లబ్ చెన్నూర్ అధ్యక్షుడు జాడి తిరుపతి, జోన్ చైర్‌పర్సన్ వెంకటేశ్వర్, వైద్యులు కుదుషా, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

* **సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి**

వేమనపల్లి: సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి రాజేష్, అన్వేష్‌లు తెలిపారు. మండలంలోని సుంపుటం గ్రామంలో సోమవారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. రోగులకు రక్తనమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహించారు. మందులు అందజేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ అపరంజి, హెల్త్ అసిస్టెంట్ లింగయ్య, ఏఎన్ఎంలు మంజుల, రాజ్యలక్ష్మి, ఆశ కార్యకర్త శారద పాల్గొన్నారు.

* **మౌలిక వసతులు కల్పించాలి**

శ్రీరాంపూర్: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నస్పూర్ సీసీసీ కేజీబీవీ సమీపంలో గల పిట్టల కాలనీలో మౌలిక వసతులు కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు గోమాస ప్రకాశ్, నస్పూర్ మండల కార్యదర్శి మిడివెల్లి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. సీపీఎం నాయకులు సోమవారం పిట్టల కాలనీలో పర్యటించారు. కాలనీవాసులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు తదితరులు పాల్గొన్నారు.

* **అంబేద్కర్ స్థలం కబ్జాపై వినతి**

భీమిని: కన్నెపల్లి మండలంలోని మత్తపూర్ గ్రామ పంచాయతీలోని ఎస్సీ కాలనీలో అంబేద్కర్ భవనం స్థలాన్ని కబ్జా కాకుండా చూడాలని సోమవారం తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.

రక్తదానం

దండేపల్లి: మండలంలోని వెల్గనూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్త అక్కల సత్తయ్య స్మారకార్థం సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. గ్రామానికి చెందిన 50మంది యువకులు రక్తదానం చేశారు. శిబిరాన్ని మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు సందర్శించారు.